తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## ఆషాడం అమావాస్య కొండనిండిన భక్తజనం

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 4 ప్రభాతవార్త

ఆషాడ మాసం చివరి రోజు అందునా ఆదివారం అమావాస్య కావడంతో శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి తైలా, నారికేళాభిషేకాలు, విశేషాలంకరణ గావించారు. రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండ భక్తజనసంద్రమైంది. సాయంత్రం వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో వచ్చిన యాత్రీకులకు ఆలయ ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది సేవలందించారు.

## రాయలచెరువు వంకభూమి స్వాహా

### - రూ. కోట్ల విలువైన భూముల ఆక్రమణ -వెలుగు చూస్తున్న వైకాపా కబ్జాలు



మూడువందల నుంచి మూడడుగులకు కుచించుకున్న రాయలచెరువు వంక



రాయలచెరువు వంకలో వైకాపా నేత నిర్మించి భవనం,దుకాణాలు

ప్రభాతవార్త, పుంగనూరు

అడిగేవాడు ఉండబోడని దొరికిందల్లా దోచేశారు,ఇసుక నుంచి ఇంటి గుమ్మాల వరకు తెగబడి మరీ దోచుకున్న పుంగనూరులోని భూబకాసురులు పదేళ్ళకాలంలో పట్టణం గుండా ప్రవహించే రాయలచెరువు వంకకు చెందిన కోట్లాది రూపాయల విలువైన భూములను కబ్జాచేసేసి,ఎంచక్కా నిర్మాణాలు చేసుకున్నారు. ఈకబ్జాల కారణంగా ఏటా వర్షాకాలంలో పుంగనూరుకు నీటి ముంపు ఎదురవుతోంది. వివరాలిలా ఉన్నాయి.పుంగనూరు ప్రాంతాన్ని పరిపాలించిన వారిలో జమీందారుగా సేవలందిచిన యశోవంత బహద్దూర్ వీర శంకరరాయల వారి కాలంలో ఇక్కడి ప్రజల వ్యవసాయం కోసం పలు చెరువులను చైన్‌లింక్ విధానంలో నిర్మించారు. పట్టణంలోని రాయలచెరువు నుంచి నీరు ప్రవహించేందుకు పట్టణం గుండా మూడున్నర కిలోమీటర్లమేరకు చెరువు వంకను నిర్మించారు. ఈవంక కొత్తఇండ్లు వద్దనుంచి మొదలై చెంగలాపురం వరకు ప్రవహిస్తుంది. ఈరాయల చెరువు వంక దశాబ్ద కాలంలో పూర్తిగా అన్యాక్రాంతమైపోయింది. పుంగమ్మ చెరువు నుంచి ప్రవహించే నీటి ఉధృతి కౌండిన్య నదిగా పట్టణంలో ప్రవహిస్తుండగా, రాయలచెరువు నుంచి పొంగిప్రవహించే నీటి ఉధృతి రాయలచెరువు వంకద్వారా ప్రవహించి నేరుగా గుడియాత్తం మీదుగా వేలూరు చెరువులకు వెళ్ళిపోతుంది. ఈక్రమంలో పట్టణంలోని ఈరెండు వంకలు ఏటా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తాయి. పట్టణమొత్తం పుంగమ్మ చెరవు,రాయలచెరువుల నుంచి బయటకు వెళ్ళిపోయే నీటిపైనే ఆధారపడి ఉంది. అందుకే ఈరెండు చెరువుల నీరు ప్రశాంతంగా వెళ్ళిపోయేందుకు ఆకాలంలోనే వంకలు నిర్మించారు. అయితే,ఇపుడవి మొత్తం కబ్జాదారుల చేతుల్లో ఉండిపోయింది. ముఖ్యంగా రాయలచెరువు వంక ప్రవహించే కొత్తఇండ్లు నుంచి ఎంపిడిఓ కార్యాలయం,కొత్తపేట ప్రాంతాల వెండి సుమారుగా వందకోట్లరూపాయల విలువైన వంక పోరంబోకు భూములు ఆక్రమణకు గురయ్యాయి. కొత్తఇండ్లు ఉన్నత పాఠశాల వద్దనుంచి ఈవంక ప్రాంతం పూర్తిగా ఆక్రమణకు గురై మూడు వందల అడుగుల వంక కాస్తా, మూడడుగుల కాలువగా మిగిలిపోయింది. ఈకాలువ వెంబడి ఉన్న వంక పోరంబోకు భూములను ఇరిగేషన్ భూములుగా రికార్డులలో నిర్ధారించారు. అయితే, పదేళ్ళకాలంలో ఈకాలువ వెంబడి భూములను నాయకుల ప్రోద్బలంతో రెవిన్యూఅధికారులు తిమ్మిని బమ్మిచేసి పట్టాలు చేసి ఇచ్చేశారు. ఇపుడు ఈకాలువ వెంబడి ఉన్న వంక పోరంబోకు భూములలో వైకాపా నాయకులే అధిక ప్రాంతాన్ని ఆక్రమించి విక్రయాలు కూడా చేసేశారు. వీరికితోడు ఈవంక స్థలం ఆక్రమణలో వైకాపా నాయకులు రియల్‌ఎస్టేట్ బిజినెస్‌లు కూడా చేసేసుకున్నారు. రాయలచెరువు వంక భూమిని రికార్డులపరంగా ఎంత ఉందో అంతా విస్తరింపచేయాలని, ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని, లేనిపక్షంలో వర్షాకాలంలో పుంగనూరు వరద ముంపునకు గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఈవ్యవహారంపై నేడు పుంగనూరులో పర్యటించనున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు దేశం ఇన్‌చార్జి చల్లాబాబులు స్పందించాలని ప్రజలు విజ్ఞప్తిచేస్తున్నారు.

## ఐదేళ్లు నిర్లక్ష్య పాలన
## రాబోయేది పరిశ్రమల పరుగు పాలన

### శివయ్య సేవలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ భూపతి శ్రీనివాసవర్మ

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త

రాష్ట్రంలో ఐదేళ్ళ పాటు నిర్లక్ష్య పాలన సాగింది. రాబోయేది పరిశ్రమల పరుగు పాలన అని కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి శ్రీనివాస శర్మ అన్నారు.ఆదివారం రాత్రి ఆయన శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. ఆయన ఆలయంలో నిర్వహించే మహిమాన్విత 'దీపారాధన'లో పాల్గొన్నారు.స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయేది పరిశ్రమల పరుగు పాలన అన్నారు.తాను కేంద్ర పరిశ్రమల శాఖ మం త్రిగా బాధ్య తలు చేపట్టిన తరువాత పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంను దర్శించుకోవటం ఎంతో అనుభూతిని కల్గించిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగం పొగొట్టుటకు రాష్ట్రం నుంచి వచ్చే ప్రతి పాదనకు అనుమతి స్తామన్నారు. కేంద్రంలో ప్రధాన మంత్రి రాష్ట్రాభివృద్ధికి సంబంధించి కట్టుబడి ఉన్నామన్నారు. మొదటి బడ్జెట్‌లోనే అమరావతికి భూరి నిధులు మంజూరు చేసారని అంతేకాక రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయుటకు అంగీకరించటం ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిపై బిజెపికి ఉన్న గుర్తింపుకు నిదర్శనం అన్నారు.ఐదేళ్ళలో కేంద్రం నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని ఇందులో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేసారన్నారు. గతంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఈ నియోజకవర్గంలో కేంద్ర ప్రతిష్టాత్మక ఐఐటి,ఐసర్ విద్యాసంస్థలను మంజూరు చేసిందన్నారు. ఈవిలేకరుల సమావేశంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్,కండ్రిగ ఉమ,జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప,సుబ్రమణ్యం రెడ్డి,అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు సకల సౌకర్యాలు

### -మాఢవీధుల్లో విస్తృత ఏర్పాట్లు తనిఖీ చేసిన అదనపు ఈఓ వెంకయ్య



తిరుమల,ఆగస్ట్ 4ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి అక్టోబర్ 4నుండి మొదలయ్యే సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తులకు విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు మలయప్పస్వామివారి వాహనసేవల వీక్షణ భక్తులు ప్రశాంతంగా చేసుకునేలా ఏర్పాట్లు జరుగుతూన్నాయన్నారు. భగవంతుని బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున అందకు తగ్గట్లు ఏర్పాట్లు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయ మాఢవీధుల్లో భక్తులు సాఫీగా గ్యాలరీల్లోకి చేరుకోవడానికి, ప్రవేశ నిష్క్రమణ మార్గాలను గమనించారు.ఆదివారం ఉదయం అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, ఆలయడిప్యూటీఈఓ లోకనాథం, విఎస్ఓ నందకిశోర్, ఆలయ ఏవిఎస్ఓ మనోహర్‌తో కలసి వాహనమండపం, ఆలయం ముందు భాగం, మాఢవీధులు, తిరుమలనంబి ఆలయం వద్ద కదిలే వంతెన, గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## అటవీశాఖ అధికారులపై ఎమ్మెల్యే నాని ఆగ్రహం

**ఎర్రచందనం వదిలేస్తారు..**
**వెదురు పుల్లలను పట్టుకుంటారంటూ ఎమ్మెల్యే అసహనం**
**ఎర్రావారిపాలెం అటవీ అధికారుల వేధింపులపై**
**ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి బాధితులు**

యర్రావారిపాళ్యం, ఆగస్టు 4, ప్రభాతవార్త

ఎర్రచందనం దొంగలను వదిలేసి ఎదురు పుల్లలను తీసుకెళ్లే రైతులను, కూలీలను పట్టుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అటవీ శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎర్రావారిపాలెం మండల కేంద్రంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశం అనంతరం ఎమ్మెల్యే దృష్టికి ఎర్రవారిపాలెం మండలంలోని ప్రజలు తమ సమస్యలను తీసుకెళ్లారు. అందులో భాగంగా అటవీ ప్రాంతం సరిహద్దులోని గ్రామాల ప్రజలు కొందరు అటవీ శాఖ అధికారులు తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని వెదురుపుల్లలు తీసుకున్నా తమపై కేసులు బనాయిస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. కొందరు అధికారులు అయితే తమను ఆర్థికంగా కూడా వాడుకున్నారని అదే విధంగా నెలసరి మామూలు వసూలు చేస్తూ తమ పై అధికారులకు కూడా ఇందులో వాటాలు ఉన్నాయంటూ కచ్చితంగా మామూలు ఇవ్వాల్సిందేనని పట్టు పట్టి మరి తమను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. దీనస్థితిలో వృత్తిపరమైన పనిలో భాగంగా తాము జీవనం సాగించడానికి వెదురుపుల్లలతో వివిధ రకాల పనిముట్లు తయారు చేసుకుని జీవిస్తున్నామన్నారు. వీరి ఆవేదనను విన్న ఎమ్మెల్యే పులివర్తి నాని అటవీ శాఖ అధికారులపై మండిపడ్డారు. మీడియా ముఖంగా రైతులు, పేద ప్రజల జోలికి వచ్చే అటవీ శాఖ అధికారుల పనితీరు మార్చుకోకుంటే వేటు తప్పదని హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులు మీ విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తూ ఎర్రచందనం దొంగలను, దొంగలను పట్టుకోవడానికి పనిచేయాలని అన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అటవీ శాఖ అధికారులు ఈ సమాచారం అప్పటికప్పుడే సామాజిక మధ్యమలలో వైరల్ కావడంతో అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యే తొగటపల్లి పర్యటనలో ఉండగా అక్కడికి రావడం అందరిని ఆశ్చర్యపరిచింది. ఎర్రచందనం దొంగలను, దుంగలను వదిలేసి వెదురు పుల్లలు, సీతాఫలం, అల్లనేరేడు, తేనె, విస్తరాకులు, ఆకులు, కలింకాయలు మొదలైన అటవీ ఫొలాలను సేకరించి విక్రయించి తద్వారా తమ జీవితాలను గడిపే నిరుపేదలను ఇబ్బందులకు గురిచేస్తుండడం చూస్తుంటే గమ్మడికాయ దొంగలను వదిలేసి సాసవ గింజలను దొంగలించిన వారిపై పెత్తనం చెలాయించే విధంగా యర్రావారిపాల్యెం మండలం అటవీ శాఖ అధికారుల పనితీరుపై మండలంలోని పలువురు ప్రకృతి ప్రేమికులు పెదవి విరుస్తున్నారు.

## గణనాధుని సన్నిధిలో కేంద్రమంత్రి భూపతిరాజు



కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:

కేంద్ర ఉకు z భారీ పరిశ్రమల శాఖామంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా ఆలయ దర్శనార్థం వచ్చిన కేంద్రమంత్రికి ముదుగా స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు ఆలయ వెలుపుల ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, ఐరాల మండల తహశీల్దార్ మహేష్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా ఎర్రదుంగలు పట్టివేత

శ్రీరంగరాజపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త:

మండలంలోని పిళ్ళారికుప్పం సమీపంలో ఆదివారం ఎస్ఆర్ పురం పోలీసులు 7 లక్షల రూపాయల విలువైన 42 ఎర్రచందనం దుంగలను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజకులాయప్ప వెల్లడించిన వివరాల మేరకు పిచ్చాటూరు మండలానికి చెందిన రవినాయుడు ఫారెస్ట్ అధికారుల నుండి ఎర్రచందనం చెట్లను కొనుగోలు చేసి, వాటికి డ్రెస్సింగ్ చేసి, నెంబర్లు వేసి వాటికి ప్రభుత్వానికి అప్పజెప్పి అనుమతులు పొందారన్నారు. అదే క్రమంలో పిళ్ళారికుప్పం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రవినాయుడు పొలంలో వున్న ఎర్రచందనం చెట్లను కొనుగోలు చేసి వాటికి డ్రెసింగ్ చేసి ఆయన పొలంలోని ఒక గోడౌన్ ఏర్పాటు చేసి దానికి ఒక వాచ్‌మెన్‌ను నియమించారన్నారు. అయితే వీటిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని తమకు ఫిర్యాదు రావడంతో దీనిపై నిఘా వుంచి ఆదివారం మధ్యాహ్నం తమకు వచ్చిన సమాచారంతో 42 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

**పోలీసులు ఎర్రచందనం స్వాధీనంపై విభిన్న కథనాలు**

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలకు సంబంధించి విభిన్న కథనాలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై పోలీసులు ఒక వివరణ ఇస్తుండగా, స్థానికులు మరోరకమైన వాదన వినిపిస్తుండటంతో ఏది వాస్తమనే విషయంపై సందిగ్ధత నెలకొంది. పోలీసులు ఈ కేసుకు సంబంధించి పిళ్ళారికుప్పం గ్రామంకు చెందిన బాలాజీని అదుపులోకి తీసుకుని తమ వాహనంలో హడావిడిగా తీసుకెళ్ళారని, అలాగే ఎర్రచందనం దుంగలను పోలీసులు శనివారం రాత్రే పోలీస్ స్టేషన్‌కు తరలించారని, ఎన్ని దుంగలు తరలించారు! వాటి బరువు ఎంత! అనే విషయాలను పోలీసులు గోప్యం పాటిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించిన బాలాజీ అదే గ్రామానికి చెందిన కొందరి పేర్లను ఈ వ్యవహారంలోకి లాగినా వారిని పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత మంది రాజకీయ పార్టీ నాయకులు ఈ వ్యవహారంలో వదలిపెట్టి అమాయకుడైన బాలాజీపై కేసు



పెట్టడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

## రికార్డు స్థాయిలో రాహుకేతు పూజలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త

వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయం కిట కిటలాడుతోంది. ముఖ్యంగా సన్నిధివీధిలోని నాల్గవ గేటు వద్ద పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. ఆదివారం సుమారు9 వేల పూజలు జరగటం గమనించదగ్గ విషయం.సాధారణంగానే శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరౌతారు. అయితే వరుస సెలవులతో రెండు రోజులుగా ఆలయం భక్తులతో కిట కిటలాడుతుంది.వచ్చిన భక్తుల దర్శనాలకు అవకాశం కల్పిస్తూ అడ్డదారి దర్శనాలతో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా కట్టడి చేసారు. అధికారిక సమాచారం మేరకు ఆదివారం సుమారు 35 వేలమంది భక్తులు దర్శనంచేసుకున్నట్లు రికార్డు.



**దళారుల ఇష్టారాజ్యం: పట్టించుకునే దిక్కులేక . . .**

ఆలయంలో పరిపాలనా సౌలభ్యం కోసం సంస్కరణలు అమలు చేస్తుంటే అడ్డదారుల్లో సంపాదనకు అలవాటు పడిన వారు సవాలక్ష మార్గాలు ఎంచుకుంటున్నారు. ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి తమ వ్యాపారం సజావుగా సాగించుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులు నిలువుదోపిడికి గురౌతున్నారు. ఈ దివ్యక్షేత్రం అప్రదక్షిణ క్షేత్రం.అయితే పరిపాలనా సౌలభ్యంకోసం దక్షిణ గోపురం వైపు పరిపాలనా భవనాలను నిర్మించారు. దాంతో అదే ప్రధాన ద్వారంగా మారింది. విఐపిలు, బస్సుల్లో వచ్చే జనం, కార్లలో వచ్చే జనం నాల్గవ గేటు గుండానే ప్రవేశిస్తారు.దాంతో ఈ ప్రాంతాలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా మూడవగేటు, నాల్గవ గేటు మార్గాలు దళారులకు వరంగా మారాయి. ఇక్కడే కార్ పార్కింగ్ ఉండటంతో 'ప్యాకేజిలు' ఖరారు చేసుకునే వారికి అనుకూలంగా మారింది.

**రికార్డు స్థాయిలో పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన వస్తుంది.ఈనేపథ్యంలో శనివారం ఆలయంలో రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారిసంఖ్య 5183 ఉంది, కాగా రూ.750ల టిక్కెట్లుకొనుగోలు చేసి పూజలుచేసుకున్న వారి సంఖ్య 2288 రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారి సంఖ్య 933, రూ.2500 టిక్కెట్లతోపూజలు చేసుకున్నవార 610, రూ.5000ల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు 154 మంది పూజలు చేయించుకున్నారు.

## తెలుగు తమ్ముళ్లలో కొరవడిన ఐకమత్యం!

### తడలో ఎమ్మెల్యే విజయశ్రీ విజయోత్సవ సభకు డుమ్మాకొట్టిన ఒకవర్గం నేతలు

తడ, ఆగస్టు 4 ప్రభాతవార్త

తడలో ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజయోత్సవ సభకు తెలుగుతమ్ముళ్ల మధ్య విభేదాలు నెలకొన్నాయి. మండలంలోని టిడిపి నాయకుల విభేదాల కారణంగా పలుమార్లు వాయిదా పడిన విజయోత్సవ సభకు ఆదివారం జరిగింది. ఈసారి కూడా తెలుగు తమ్ముళ్లలో ఐకమత్యం కనిపించలేదు. ఒకవర్గం నాయకులు, కార్యకర్తలను భారీగా సమీకరించగలిగారు. మరోవర్గం నాయకులు ఈ కార్యక్రమానికి డుమ్మాకొట్టారు. టిడిపి సీనియర్ నేత, దివంగత వేనాటి పరంధామిరెడ్డి కార్యాలయం నుంచి ఈ ప్రదర్శనను మొదలుపెట్టి తెలుగు యువత నాయకుడు తడ రవి కార్యాలయం వద్ద సభ జరపాలని ముందుగా నిర్ణయించారు. ఆ మేరకు ఎమ్మెల్యే విజయశ్రీ ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అయితే స్థలం ఎంపిక, కొన్ని ఫ్లెక్సీలలో కొందరి పేర్లు లేకపోవడం వంటి వాటిపై అభ్యంతరాలు నెలకొన్నాయి. ఉదయం జరగాల్సిన కార్యక్రమం మధ్యాహ్నం దాకా నిలిచిపోయింది. ఎట్టకేలకు అనేక చర్చల అనంతరం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రం నుంచి ముఖ్య నాయకులెవరూ హాజరు కానప్పటికీ విజయోత్సవ సభ జన సమీకరణపరంగా విజయవంతమవడం విశేషం. మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, తడ రవి, ఆర్.శివాజీ, రామమూర్తి, శకుంతలమ్మ, పూడి సుందరం, కెవి రెడ్డి, వేనాటి రాజారెడ్డి, గండవరం రమేష్‌రెడ్డి, రమేష్, ఏడుమలైరెడ్డి, బిజెపి మండల శాఖ అధ్యక్షుడు రాచర్ల కృష్ణమూర్తి, తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశ్రీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముందు, కార్యక్రమం తర్వాత కూడా నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తడ మండలంలోని ఇరువర్గాల నాయకులతో విడివిడిగా సుదీర్ఘ చర్చలు జరుపుతున్నారు. విభేదాలు వీడి పనిచేస్తేనే మండలంలో అభివృద్ధి పనులు సాధ్యపడతాయని ఆయన నేతలతో అంటున్నారు. త్వరలో జరగనున్న నామినేటెడ్ పదవుల పందేరంపై కూడా వర్గ విభేదాలు పడతాయని, పార్టీ ముఖ్య నేతలు ఇప్పటికైనా స్పందించి మండలంలో ఐకమత్యాన్ని తీసుకురావాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు.



## తెలుగుదేశం పార్టీలో నటించే వారిని పక్కన పెడతాం

**– మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్.**

**కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీలో పార్టీకోసం పనిచేయక నటించేవారిని త్వరలోనే పూర్తిస్థాయిలో పక్కన పెడతామని మండల టిడిపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు.ఆధివారం మోట్లచేను గ్రామంలో జరిగిన పార్టీసమా వేశంలో ఆయన మాట్లాడారు.గత రెండు ఎన్నికల్లో ఈ పంచాయతీలో ఆశించిన ఫలితాలు రాకపోవ డంతో పంచాయతీపార్టీ కమిటీలనురద్దుచేసి నూతనకమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పం అభివృద్ధిని ఆకాంక్షించి ఇతర పార్టీలనుంచి ఎవరైనా వస్తే ఆహ్వానిస్తామన్నారు.ఇటువంటివారి రాకపై ఎవరూ అపోహపడరాదని పేర్కొన్నారు.పార్టీలో కష్టపడేవారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు.సేమ్ చంద్రబాబు నాయుడు ఆదేశాలమేరకు పార్టీకోసం కష్టపడేవారికి సముచిత స్థానం లబిస్తుందన్నారు,ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రామచంద్ర,తెలుగు యువత రాష్ట్రనేత పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపంజాణి తహశీల్దార్‌గా ప్రసన్నకుమార్ బాధ్యతలు

**పెద్దపంజాణి, ఆగస్టు 4 ప్రభాతవార్త :**



పెద్దపంజాణి మండల తహశీల్దార్‌గా ప్రసన్న కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు గంగవరం మండలంలో డిప్యూటి తహశీల్దార్‌గా విధు లునిర్వహిస్తూ ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపంజాణి మండలానికి పూర్తి అదనపు బాధ్యతలతో తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన తహశీల్దారును రెవిన్యూ అధికారులు,సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## నేటినుంచి ముత్తు శ్రీ ముత్తుమారెమ్మ బ్రహ్మోత్సవాలు.

**కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త :**

కుప్పంపట్టణం రామచంద్రారోడ్డులో వెలసిన శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్స వాలను సోమవారంనుంచి నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ హర్షధర్మతేజ,కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఘణపతిపూజ,కళశస్థాపన,హోమాలు అ్మవారికి పంచామృత అభిషకం నిర్వహిస్తామన్నారు. 6వతేది అమ్మవారికి అభిషేకం అంబలిపోయుట 7వతేది అమ్మవారికి అభిషేకం మధ్యాహ్నం అన్నదానం అమ్మవారికి పుష్పపల్లకి సేవా నిర్వహిస్తామన్నారు.భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## త్వరలో దామలచెరువు- నేంద్రగుంట నూతన బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

### పాకాల రైల్వేస్టేషన్‌కు గూడ్స్ షెడ్, ఆర్టీసి డిపో ఏర్పాటు

### పాకాల మండల మీట్‌లో ఎమ్మెల్యే నాని

**పాకాల, ఆగస్టు 4, ప్రభాతవార్త**



పాకాల మండలం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిం చారు. ఈ మండల సర్వసభ్య సమా వేశంకు ముఖ్యఅతిధిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యా రు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులతో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల పనులు కొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనిరాగా వాటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే వాటి నిధులు సేకరణ కొరకై ఇప్పటికే ప్రతిపాదనలు పూర్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో త్వరలో దామలచెరువు నేంద్రగుంట నూతన బైపాస్ రోడ్డు, త్వరలో పాకాల రైల్వే స్టేషన్‌కు గూడ్స్ షెడ్, పాకాల ఆర్టీసి డిపో ఏర్పాటుకు ఎంత వ్యయం అవసరమో అంచనా వేయాలన్నారు. అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని దిశానిర్దేశం చేసారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్

**చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎస్పీ కోరారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ నిత్యానందబాబు

**పాకాల, ఆగస్టు 4, ప్రభాతవార్త**

పాకాల మండలం నూతన తహశీల్దార్‌గా ఆదివారం జె. నిత్యానంద బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్వరం పెండింగ్ ఫైల్ అన్ని కూడా సకాలంలో పూర్తి చేస్తాన న్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు.

## ఘనంగా శ్రీచౌడేశ్వరి జయంతి

**పుంగనూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త**



మండలంలోని చదళ్ళగ్రామంలో వెలసిన శ్రీసప్త మాతృక సమేత శ్రీచౌడేశ్వరి అమ్మవారి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్, ఆలయ నిర్మాణవేత్త ఎన్.వేణుగో పాల్‌రెడ్డి అధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి శ్రీసుబ్రహ్మణ్యహోమం, నవగ్రహ,మృత్యంజయ, చౌడేశ్వరిహోమాలు నిర్వహించారు. అనంతరం జయంతి ఉత్సవం సందర్భంగా పూర్ణాహుతి చేపట్టారు. ఆలయాన్ని బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ప్రత్యేక పూలతో వైభవంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి పరిసరగ్రామాల నుంచే కాకుండా పట్టణం నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమాలను ఎస్వీఆర్ ట్రస్టు కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరమణారెడి , జయపాల్‌రెడ్డి,శంకర్‌రెడ్డి ,వెంకటరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి,భాస్కరరెడ్డి,చిట్టి తదితరులు పర్యవేక్షించారు.

## సమాజ సేవలో లయన్స్‌ది సింహభాగం

**పుంగనూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త**




సమాజసేవలో లయన్స్‌ది ప్రపంచ వ్యాప్తంగా సింహ భాగమని లయన్స్‌మాజీ గవర్నర్ భక్తవత్సలరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని లయ న్స్‌క్లబ్ భవనంలో నూతన కార్యవర్గప్రమాణ స్వీకా రానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. లయన్స్ జిల్లా కోఆర్డినేటర్ అరున్‌కుమార్ ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. లయన్స్ జిల్లా అంబాసిడర్ డాక్టర్ శివ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాలలో విద్య, వైద్య,సేవారంగాలలో వినూత్న పోకడ సృష్టించింది లయన్స్‌సభ్యులే అన్నారు. ఈసందర్భంగా పేదలకు కుట్టుమిషన్లు,పదోతరగతి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు,పతకాలు, చిరువ్యాపారులకు ఎండగొడుగులు, ప్రతిభావంతులకు చక్రాల కుర్చీలు,డయాలసిస్‌కేంద్రాలకు ఆక్సి జన్ కాంసంట్రేటర్‌లు,డయాలైజర్ మిషన్, గురుకుల విద్యార్థులకు ఛాంపియన్ సర్టిఫికేట్లు పంపిణీచేశారు. క్లబ్ అధ్యక్షుడుగా త్రిమూర్తిరెడ్డి, కార్యదర్శిగా అమరావతి సురేష్‌లతో పాటూ కార్యవర్గసభ్యుల ప్రమాణీస్వీకారం జరిగింది. లయన్స్‌క్లబ్ ఆర్.సి గోపాలకృష్ణ,వరదారెడ్డి,బాలసుబ్రహ్మణ్యంలతో పాటూ లయన్స్‌సభ్యులు పాల్గొన్నారు

## నేటినుంచి సుజ్ఞానందఆశ్రమంలో భగవత్‌గీతా పారాయణం

**కుప్పం రూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**

కుప్పంపట్టణంలోని టిబి రోడ్డులోఉన్న శ్రీ సుజ్ఞానంద ఆశ్రమంలో నేటినుంచి ప్రవచనాలు,భగవత్‌గీతా పారాయణం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.ప్రతిరోజు ఉదయం 6.30గంటలనుంచి 8 గంటలు మరలా సాయంత్రం 6 గంటలనుంచి 7,30 గంటలదాకా ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బిందు తుంపర్ల సేద్యాన్ని సద్వినియోగం చేసుకోండి

**చౌడేపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త**

ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన బిందు, తుంపర్ల సేద్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖాధికారిణి సంతోషి కుమారి కోరారు. పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాలకు చెందిన దాదాపు 32వేల మంది రైతుల 45వేల ఎకరాల్లో బిందు సేద్యానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, పెద్దరైతులకు 70శాతం రాయితీ వుంటుందన్నారు. ఆసక్తిగల రైతులు పాసుపుస్తకం, 1బితో దగ్గర్లో వున్న రైతుసేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

## అమాత్యా! పాడి రైతుల గోడు పట్టించుకోండి

**సోమల, ఆగస్టు 4, ప్రభాతవార్త**




ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజకవర్గంకు మొదటిసారిగా విచ్చేస్తున్న సందర్భంగా పాడి రైతులు తమ గోడును మంత్రికు వెల్లబోసుకుంటున్నారు. సోమల మండలంలో 80 శాతం ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. అందులో అందరూ దాదాపుగా పాడి పరిశ్రమపైనే జీవనం సాగిస్తున్నారు. ప్రతి రైతుకు పాడియావులు ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని రైతు నిలబడ్డాడు అంటే పాల మీద వచ్చే డబ్బే ఆధారం. నాటి ప్రజల అవస్థలు గమనించి అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రైతులను ఆదుకునేందుకు సోమలకు బిఎంసిని మంజూరు చేసారు. 3000 లీటర్ల సామర్థ్యంతో లాభాల దిశలో పయనిస్తున్న డైరీని తరువాత వచ్చిన పాలకులు అదో పాతాళానికి తొక్కేశారు. తన డైరీని డెవలప్ చేసుకునే ఉద్దేశ్యంతో సోమల డైరీని బలవంతంగా మూయించేశారు. నాటి నుంచి రైతులు పాలను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక వారి చెప్పిన రేటుగా ప్రైవేట్ డైరీలకు విక్రయిస్తున్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పందించి తిరిగి డైరీ తినిపించి పాడి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

## యాదవ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడిగా ఉమాపతియాదవ్

**పాలసముద్రం, ఆగస్టు 4 ప్రభాతవార్త:**



మండల యాదవ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్.ఉమాపతియాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలసముద్రంలో ఆదివారం మండల యాదవ ఎంప్లా యిస్ సొసైటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మండల కార్యవర్గ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా పి.చంద్రశేఖర్‌యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.రఘుయాదవ్, ఆర్థిక కార్యదర్శిగా జె.మోహన్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా కె.కేశవులు యాదవ్, ఇ.కోదండయ్యయాదవ్, కార్యదర్శులుగా అమరనాథ్‌యాదవ్, రాఘవేంద్రయాదవ్, శ్యామలమ్మ, సాఫ్ట్‌వేర్ విభాగం కన్వీనర్‌గా ఎస్.చిరంజీవులు యాదవ్,సభ్యులుగానవీన్‌యాదవ్,పృధ్వీరాజ్‌యాదవ్‌తదితరులుఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల యాదవఎంప్లాయిస్‌సొసైటీఅధ్యక్షలుఉమాపతియాద్,గౌరవఅధ్యక్షులు ఎస్.రఘు యాదవ్‌లు మాట్లాడుతూ జిల్లాలోనియాదవసోదరులందరుఏకతాటిపైతీసుకురావడానికిప్రతియాదవ్ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధికి త్యాగాలకు సిద్ధం

**– జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపు**

**చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:**

జిల్లా సమగ్ర అభివృద్ధికి కార్యకర్తలు త్యాగాలకు సిద్ధం కావాలని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశం ఆదివారం చిత్తూరు కట్టమంచి మ్యాంగో మార్కెట్ పరిసరాల్లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త నడుంబిగించాలన్నారు. జిల్లా విభజన చెందడంతో అటు కర్నాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలు సరిహద్దుగా వున్నప్పటికీ జిల్లా పూర్తిగా వెనుకబడి పోయిందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన జిల్లా పరిస్థితి మాత్రం మారడం లేదన్నారు. జిల్లాలో కేంద్ర విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి, హంద్రీ–నీవా పనులను సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ భూములు, క్వారీలను కబ్జా చేస్తున్న నాయకులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలన్నారు. అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి పెద్ద ఎత్తున జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు పూనుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులు ఎం.శ్రీరాములు, జిల్లా సిపిఐ నాయకులు కె.మణి, ఎం.సుబ్రమణ్యం, దాసరిచంద్ర, విజయకుమార్, కె.విజయగౌరి, రమాదేవి, బి.కుమారి, వి.కోమల, వి.రఘులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి నగరి, పుంగనూరు, పలమనేరు, పూతలపట్టు, జిడినెల్లూరు, చిత్తూరు నియోజవకర్గ సిపిఐ కార్యకర్తలు హాజరయ్యారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గూడూరు పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు

### అరుంధతీయపాలెంలో కార్డెన్ సెర్చ్

### నిషేధిత హాన్స్, గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

### డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి

**గూడూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని అరుంధతీవాడ, బనిగిసాహెబ్ పేట ప్రాంతాలలో డిఎస్పీ ఆధ్వర్యంలో సిఐలు, ఎస్ఐలతో పాటు 60 మంది పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి సరైన దృవీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డిఎస్పీ ఎం. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ నేరాలకు ఎటువంటి శిక్షలు పడతాయని తెలుసుకుంటే నేరాలజోలికి వెళ్లరన్నారు. ఈ ప్రాంతంలో అనుమానం ఉన్న ఇళ్లన్నీ గాలించామన్నారు. ముఖ్యంగా గంజాయి అక్రమంగా విక్రయించినా, నిషేధిత వస్తువులు రవాణా చేసినా కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నేరాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడిపినా, మద్యం సేవించి వాహనాలు, నడిపినా కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ పాపారావు, రెండవ పట్టణ సిఐ రవికిరణ్, రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు మోటార్‌సైకిళ్ళు ఢీ

### –ముగ్గురికి తీవ్రగాయాలు

**దొరవారిసత్రం ఆగస్టు 4 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దొరవారిసత్రం సమీపంలో జాతీయ రహదారిపై రెండు మోటార్‌సైకిళ్ళు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. దొరవారిసత్రం మండలం చందనముడి గ్రామానికి చెందిన కృష్ణ,తేజోవతి మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటలోని చర్చికి వెళ్ళి తిరిగి వస్తుండగా అదేమార్గంలో ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్ ప్రమాదవశాత్తు ఢీకొంది.దీంతో కృష్ణ,తేజోవతి,శశిధర్‌లు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు క్షతగాత్రులను 108లో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాంబట్టులో నేత్రదాత వెంకటరత్నంరెడ్డి

**తడ, ఆగస్టు 4 ప్రభాతవార్త**



తడ మండలం మాంబట్టుకు చెందిన కాకు వెంకటరత్నంరెడ్డి (84) ఆదివారం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయం వారికి అందజేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు నేత్రదాన మహోద్యమంలో చురుగ్గా పాల్గొని నేత్రదానంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. సూళ్లూరుపేట ప్రాంతానికి సంబంధించి వెంకటరత్నంరెడ్డి 440వ నేత్రదాతగా గుర్తింపు పొందారని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు తెలిపారు.

## జాతర పనులు రూ.2 కోట్లు నిధులివ్వండి

### కౌన్సిలర్ శంకరయ్య

**వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త**



గ్రామ శక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా 14వ వార్డులో పలు పనులను చేపట్టేందుకు రెండు కోట్ల రూపాయిల నిధులు ఇవ్వాలని కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను కోరారు. 14,15 వార్డులలో మురుగు కాలువల శుభ్రత పనులను ఆయన పరిశీలించారు. ఎన్నో సంవత్సరాల నుండి కాలువలో చెత్తాచెదారం పేర్కొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పుడు కాలువల్లో చెత్తాచెదారం తొలగించడం వల్ల వర్షపు నీరు బాగా ప్రవహిస్తాయని తెలిపారు. దోమల తాకిడి కూడా తగ్గుతాయని చెప్పారు.

## టిటిడి జేఈవో కలిసిన ఎమ్మెల్యే రామకృష్ణ

**వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త**



తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకయ్య చౌదరిని మర్యాదపూర్వకంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ కలిశారు. పుష్పగుచ్చం అందజేసే అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం

**చిల్లకూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త**




చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామస్తులు ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్‌కి అనేక సమ స్యల్ని విన్నవించారు. అందులో భాగంగా గ్రామ ప్రాథమిక పాటవాల సమీపంలో రోడ్డుకి పాఠశాల ప్రహరి గోడకు మధ్య పశువుల పాక వేసి బర్రెలను అందులో కట్టేవారు. అందవలన పాఠశాలలో చదివే చిన్నారులు బర్రెలు వేసే పేడ, మూత్రం వలన అనారోగ్యంకు, దోమకాటుకు గురి అవ్వగా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాకను తీయ్యమన్నప్పటికీ వారు మాట వినకపోగా, దుర్భాషలాడగా ఈ విషయం శాసన సభ్యులు దృష్టి తీసుకొని పోగా, వెంటనే రెవెన్యూ, పోలీసు వారిని పంపి జెసిబి సహాయంతో తొలగించివేసారు. సహాయం చేసిన శాసన సభ్యులు సునీల్ కుమార్‌కి, నానాజీకి గ్రామస్తులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మేగనూరు వెంకటకృష్ణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపి వేమిరెడ్డికి ఘన సన్మానం

**గూడూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవ సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానిం చారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు బ్రాహ్మణ సేవా సంఘాన్ని కొనియాడారు. అనంతరం ఎంపికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షులు అని మెళ్ళ శివ కుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కడివేటి రామూర్తి, శ్రీనివాస్ కుమార్, నరసింహ రావు, కమల కుమారి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలే శ్రీ రామరక్ష : డాక్టర్ తనుజ

**గూడూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త**



పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు క్రమం తప్పకుండా తల్లిపాలు అందిస్తే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తనుజ తెలిపారు. గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను బాలింతలకు తెలియజేశారు. అనంతరం పౌష్టికాహా రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తనుజ మాట్లాడుతూ తల్లిపాల యొక్క అవశ్యకతను, ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు నెల మొదటి వారం రోజులపాటు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి సభ్యులు, బాలింతలు గర్భవతులుపాల్గొన్నారు.

## శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు

### కాపు బలిజ సంక్షేమ సంఘం ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య

**వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త**



శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం ఏర్పా టు చేస్తామని కాపు బలిజ ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణయ్య తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ కాపు బలిజ తెలగ కులస్తుల సమావేశం తూర్పు వీధి లోని కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆయన మా ట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం ఏర్పాటు స్థలం పరిశీలించడం జరుగుతుందని త్వరలోనే శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం ఏర్పాటు చేస్తారని తెలిపారు. అదే విధంగా ట్రస్ట్ సభ్యులందరూ కలిసి వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలిసి కాపులకు కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తానని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సుంకర్ రవి, తిరుపాల్, తులసి దాస్, మల్లు రవీంద్ర, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్పిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని కోరిన బిజెపి నేత

**వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త**



వెంకటగిరి ప్రాంతంలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని వారి అభ్యున్నతి కోసం స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేయించాలని కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కు శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను కోరారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు నాయకులు కలిసి కోరారు. స్పిన్నింగ్ మిల్ ఏర్పాటు చేస్తే చేనేత కార్మికుల్లో జీవనోపాధి పెరుగు తుందని తెలిపారు. కేవలం చేనేత పరిశ్రమ నమ్ముకొని ఇక్కడ వారు జీవిస్తున్నారని ముడి సరుకులు కోసం బెంగుళూరు ప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. ఇంకా అప్పల సమస్యలను మంత్రి తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గురు ప్రసాద్, పెంచలయ్యలు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ విజయోత్సవ సభను జయప్రదం చేయండి

### ఎమ్మార్పీఎస్ నాయకులు

**వెంకటగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త**



మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల నుండి సుదీర్ఘపోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగ జీవితాలలో వెలుగునింపిన ఆయనకు డక్కిలి మండలంలో విజయోత్సవ సభ నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు సర్వేపల్లి రత్నమ్మ డక్కిలి మండలంలో ఆయన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ విజయోత్సవ సభకు వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణని ముఖ్య అతిధిగా ఆహ్వానించాలని అందరు తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక గద్దల మునెయ్య, మాదిగ ఉద్యోగ సమాఖ్య తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు కంభంపాటి వెంకట సుబ్బయ్య, గద్దల చెంచు మోహన్, గద్దల కృష్ణయ్య, రాగిపాటి కృష్ణయ్య, దగ్గోలు పాపయ్య, యలకచర్ల శ్రీనివాసులు, చేమూరు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**గూడూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త**



కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన గూడూరు రైల్వే స్టేషన్ పరిధిలోని సౌత్ యార్డు వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీస్‌ల కథనం మేరకు మృతుడు గూడూరు రెండవ పట్టణ పరిధి లోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగుర్‌గా గుర్తించా మన్నారు. కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు అని విచారణలో తేలిందన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించమాన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తిలో రేణిగుంట వాసి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట భగత్‌సింగ్ కాలనీకిచెందిన వ్యక్తిగా భావిస్తున్న ఓ యువకుడు శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలో గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి ప్రజలు గుర్తించి 108కు సమాచారం అందించారు. వారు వెంటనే ఆతనిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి చేర్చి వైద్యచికిత్సలు అందిస్తున్నారు.

## వాకర్స్ సంఘంచే స్నేహితుల దినోత్సవం

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని వాకర్స్ అసోసియేషన్ సారథ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి రోజూ భరద్వాజతీర్థంలో వందలాది మంది పట్టణ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు,వ్యాపారవేత్తలు,రిటైర్డ్ ఉద్యోగులు వేకువ జాము 4గంటల నుంచి వాకింగ్ చేస్తుంటారు.ఈ నేపథ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా న్యాయవాది చలమయ్య సారథ్యంలో కేక్ ఏర్పాటు చేసి కట్ చేసి శుభాకాంక్షలు తెలుపకున్నారు.చలమయ్యతో పాటు శెట్టిపల్లి సురేష్,గాజుల సత్యనారాయణ,రవి,సుబ్రమణ్యం, లోకనాథం,చెంచురాజు మాజీ మున్సిపల్ చైర్మెన్ పార్థసారథి,స్వర్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 4 ప్రభాతవార్త



పాపానాయుడుపేటలో ఆదివారం తిరుపతి రోటరీ క్లబ్ సారథ్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు.తిరుపతి వెంకటేశ్వర విజ్ఞాన సంస్థ సిమ్స్, తిరుపతి రోటరీ క్లబ్ సారథ్యంలో సంయుక్తంగా పాపానాయుడుపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో పరిసర గ్రామాల్లోని ప్రజలకు వైద్యపరీక్షలు జరిపారు. 150 మందికి బిపి,షుగర్ పరీక్షలు కూడా జరిపించుకున్నారు. డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కుమార్ సారథ్యంలో కంటి వవైద్యనిపుణులు డాక్టర్ ప్రభంజన్, డాక్టర్ సంధ్యారాణి వారి సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో రోటరీ క్లబ్ తిరుపతి అధ్యక్షుడు సోమూరవి, కార్యదర్శి రాజేస్, కెవి.చలపతి,జోన్ గవర్నర్ హేమసుందర్,దామోదరం రామమోహన్‌రెడ్డి, మునస్వామిశెట్టి, పాపానాయుడుపేట సర్పంచ్ లలితా కరుణాకర్, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, ఆగంకుమార్‌శేఖర్, ఆగం గోపి తదితరులు పాల్గొన్నారు

## నిత్యాన్నదాన పథకానికి కూరగాయలు విరాళం

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాదు వాస్తవ్యులు యాక్టివ్ నెస్ మురళీ ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు 1,116కిలోల కూరగాయలను ఆలయాధికారులకు అందించారు.వీటిని ఆలయ డిప్యుటీ ఈవో ఎన్ఆర్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనంతోపాటు తీర్థప్రసాదాలను అందించి సత్కరించారు.

## కార్యదర్శికి సత్కారం

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త



పట్టణంలోని పురపాలక సంఘంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా భాస్కరపేట సచివాలయంకు సంబందించిన వెల్ఫేర్ కార్యదర్శి ఎం.డిల్లీ అందరికంటే ముందుగా ఉదయం 4గంటల నుంచే అర్హులకు పంపిణీచేసి 99శాతం పూర్తిచేసినందుకు కమిషనర్ రమేష్‌బాబు, మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, ఆర్ఐ రవికాంత్‌లు కార్యదర్శిని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఇలాగే పనిచేసి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కమిషనర్ కోరారు.

## పరిసరాల పరిశుభ్రతోనే సంపూర్ణ ఆరోగ్యం

### –మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

తొట్టంబేడు, ఆగస్టు 4 ప్రభాతవార్త



యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సోషల్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంస్థ అధ్యక్షులు హేమకుమార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి సబ్‌జైల్ పరిసర ప్రాంతాలను శుభ్రపరచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి సబ్‌జైల్ జైలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సోషల్ సర్వీస్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఈనేపథ్యంలో ఆదివారం సబ్‌జైలు పరిసర ప్రాంతాలను శుభ్రపరచి మొక్కలు నాటి వాటి రక్షణను కూడా తామే బాధ్యత వహిస్తామన్నారు. సంస్థ అధ్యక్షులు హేమకుమార్ మాట్లాడుతూ సంస్థ 16 సంవత్సరాలుగా విద్య, వైద్య, మౌలిక వసతులను ప్రజలకు అందించే విధంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, నేటి కంప్యూటర్ ప్రపంచంలో మొక్కలు కనుమరుగవుతున్నాయని ఆక్సిజన్ లేకుండా కరోనా సమయంలో మృతిచెందారని, కాబట్టి ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులను జైలర్ శ్రీకాంత్ అభినందించారు. అనంతరం జైలు ఆవరణలో పండ్లు మొక్కలు, ఇతర మొక్కలు అందించారు. సంస్థ సభ్యులు హేమకుమార్, నారాయణ, శ్రీనివాసులు, చంద్రకాంత్, కాంగ్రెస్, రవి, ప్రదీప్, యుగంధర్, అంజయ్య, రాజశేఖర్, సురేష్, సబ్‌సూపరింటెండెంట్ శ్రీకాంత్, సిబ్బంది శ్రీనివాసరావు, వెంకటరావు, వార్డన్స్ క్రాంతి, భాస్కర్, సాములు హోంగార్డు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మండలాలకు నూతన తహశీల్దార్ల నియామకం

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఆగస్టు 4 ప్రభాతవార్త



ఎన్నికల విధులు నిర్వహించేందుకు విచ్చేసిన ఇతర మండలాలకు చెందిన తహశీల్దార్‌లకు ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో తిరుపతి కలెక్టరేట్‌లో పనిచేసే డి.లక్ష్మినారాయణ శ్రీకాళహస్తి తహశీల్దార్‌గా, తొట్టంబేడు మండలానికి యు.మధుసూధన్‌రావు, బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి శ్రీకాళహస్తిలో గతంలో పనిచేసి ప్రస్తుతం వడమాలపేటలో పనిచేస్తున్న ఐ.సుబ్రమణ్యంను నియ మిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తొట్టంబేడు తహశీల్దార్‌గా నియమించిన మధుసూధన్‌రావు ఇదే మండలంలో డిప్యుటీ తహశీల్దార్‌గా సమర్థవంతంగా పనిచేశారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న శివరామసుబ్బయ్యను చంద్రగిరి తహశీల్దార్‌గా నియమించారు.

## అంకాళమ్మ ఆలయం వద్ద అన్నదానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త



పివిరోడ్డులో వెలసి ఉన్న అంకాళమ్మ ఆలయం వద్ద గత మూడు సంవత్సరాలుగా మరాఠీపాళెం వాస్తవ్యులు అయిన యశ్వంత్‌రావు, బాలజీరావు, సత్యనారాయణ, రాజశేఖర్ రావుల ఆధ్వర్యంలో నిరుపేదలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల సహాయ సహకారాలు అందించిన డాక్టర్ కృపానిధి, రెడ్డివారిశివకుమార్, క్రాంతికుమార్, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, గణేష్‌బాబు, దామెర బాలకృష్ణ, వినీత్‌రెడ్డి, నాగేష్, బాబ్జీరావు, వినోద్‌రావు, అశ్వినిచైత్ర, అనూష, షర్మిళ, కృష్ణప్రియ, శ్రీరాం, అరుణ్ భరత్, అమర్నాధ్, సాయిప్రదీప్, అవినాష్‌రెడ్డి, బాలాజీ, ఓంకార్; నాగేంద్ర, వరప్రసాద్, లీలామోహన్, దిలీప్, మయూర్‌ప్రసన్న, రాజేశ్వరరావు, దినకర్‌రెడ్డి, కార్తీకేయన్, చేతలిశర్మ, జయంత్‌సింగ్, ఆనంద, దీపాన్ష్‌యాదవ్, హరిహరకుమార్, శివప్రసాద్, వినోద్‌కుమార్, సతీష్‌లతో పాటు మరాఠీ పాళెం వాస్తవ్యులు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## తుఫాను బాధితులకోసం విరాళాల సేకరణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త



ఇటీవల కేరళలో సంభవించిన తుఫానుకు కొండచరియలు విరిగిపడి ఎందరో మృతి చెందడం, ఇల్లు కూలిపోయిన వరదబాధితులకు సహాయార్థం శ్రీకాళహస్తిలోని సిపిఎం జిల్లా నాయకులు అంగేరిపుల్లయ్య ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. పట్టణంలోని పెండ్లి మండపం వద్ద నుంచి నాలుగుమాడావీధులుగుండా కేరళ వరదబాధితులను ఆదుకోవాలంటూ నినాదాలు చేస్తూ విరాళాలు సేకరించారు. సిపిఎం జిల్లా నాయకులు అంగేరిపుల్లయ్య మాట్లాడుతూ కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడడం వల్ల ఇప్పటి వరకు 289మంది మృతిచెందారని, వందలమంది గల్లంతయ్యారని తెలిపారు. లక్షల మందిని నిరాశ్రయులుగా మార్చిన ఈప్రళయం వల్ల వందలకోట్లు ఆస్తినష్ట సంభవించిందని ఇప్పటికీ అనేక మంది శిధిలాలకిందే ఉన్నారని వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు రూపంలో విరాళాలు సేకరించి కేరళ బాధితులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో మణిలతో పాటు పలువురు సిపిఎం నేతలు పాల్గొన్నారు.

## అధికారులతో వసూళ్ళు మాపని కాదు

### మీ అవినీతిపై సమగ్ర ఆధారాలు వున్నాయి..!

### టిడిపి చంద్రగిరి, తిరుపతి రూరల్ అధ్యక్షులు

చంద్రగిరి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



అధికారులతో వసూళ్ళకు పాల్పడటం మాపని కాదంటూ టిడిపి చంద్రగిరి, తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి దుయ్యబట్టారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలోని 6 మండలాలకు సంబంధించి తహశీల్దార్ల బదిలీలలో ముడుపులు చేతులు మారినట్లు మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. టిడిపి అధికారం చేపట్టి కేవలం రెండు నెలలే అవుతుందన్నారు. ఈ రెండు నెలల్లో ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రజాహిత అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. గత 5 ఏళ్ళ కాలంలో ఎంఎల్ఏగా మీరు చేసిన అవినీతి, అక్రమాలపై మా వద్ద సమగ్ర ఆధారాలు వున్నాయని, మీరు ఎక్కడికి తీసుకురమ్మన్నా తీసుకువస్తామంటూ స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనలో మా నాయకుడు పులివర్తి నాని నాయకత్వంలో పనిచేయడానికి అనేక మంది అధికారులు ఆసక్తిని కనబరుస్తూ వినతులు అందజేసినట్లు తెలిపారు. అయితే అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ నోటీసులు పంపడం సమంజసం కాదన్నారు. గత 5 ఏళ్ళలో మీరు నియమించుకున్న అధికారులతో మండల పరిషత్, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఇలా అన్ని విభాగాలలో ఇష్టారాజ్యంగా అక్రమాలు చేయించి, వసూళ్ళు చేసింది వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. తుడాలో వందల కోట్ల అవినీతికి పాల్పడటం నిజం కాదా అంటూ నిలదీశారు. సమర్థులైన అధికారులు అభివృద్ధి కోసం ఎంఎల్ఏతో కలసి పనిచేయడానికి వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, మాజీ తుడా డైరెక్టర్ ఏజి పల్లి బాల, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, విసిరిపాటి శంకర్, రాజులగారి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌సిపురం తహాశీల్దార్‌గా వెంకటరమణ

రామచంద్రాపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



ఆర్‌సి పురం తహాశీల్దార్‌గా కె.వెంకటరమణ ఆదివారం డిప్యూటీ తహాశీల్దార్ కె.పునితరాణి నుండి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల నిమిత్తం కడప తహాశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మండల ప్రజలకు అందుబాటులో వుండి వారి సమస్యలపై స్పందిస్తామన్నారు. అనంతరం ఆర్ఐ కృష్ణమ్మ రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందితో కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### ఉద్యోగులు,ఉపాధ్యాయులు

## గాండ్ల కులానికి వెన్నెముకగా నిలవాలి

### –సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ

తిరుపతిటౌన్,ఆగస్ట్ 4ప్రభాతవార్త:



వెలుగులు నింపిన గాండ్ల కులానికి సంఘం ఉపాధ్యాయులు, ఉద్యోగులు వెన్నెముకగా నిలవాలని గాండ్లతెలికుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం విహెచ్‌కె ఫంక్షన్ హాల్‌లో జరిగింది. అఖిల గాండ్లతెలికుల ఉపాధ్యాయ ఉద్యోగ ఫెన్షనర్ల సంఘం నాయకులు సంక్షేమంపై మాట్లా డారు. అభివృద్ధికి, సాధికారతకి చేరువకావాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్వీయూ విసి ఆచార్య చిప్పాడ అప్పారావు, డిఎస్పీ శ్రీనివాసులు, శోలింగర్ గిరిశ్రీనివాస్, పుట్టపర్తి నాగేశం, మురళి, ఆర్కాడ్ హుమాద్రి, బద్రిజయకుమార్, బాస్కర్, చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, శ్రీధర్, రమణయ్య, పెండ్లిమరి మల్లికార్జున్, రమేశ్,ప్రసాద్, తులసీరామ్, రామచంద్రయ్య, రామచంద్ర, పద్మాకర్ పాల్గొన్నారు.

**–నూతన కార్యవర్గం ఎన్నిక:**

ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఏజిటియుపిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడుగా వాకాటి హరికృష్ణ, కోశాధికారిగా ఆర్కాడ్ హేమాద్రి, గౌరవ అధ్యక్షుడుగా రెడ్డిరమేశ్, రాష్ట్రముఖ్య సలహాదారుడుగా పుట్టపర్తి నాగేశం, ఉపాధ్యక్షుడుగా లక్ష్మిపతి, తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా రామిచెట్టి,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాలకృష్ణారెడ్డిని, గౌరవ అధ్యక్షుడుగా ఈశ్వరయ్య, ఉపాధ్యాక్షులుగా రెడ్డయ్య,సుదీర్,కామేశ్వర ప్రసాద్, సహాయ కార్యదర్శిగా శేఖర్; మోహన్‌రావు, మీడియా కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా భాస్కర్, కార్యనిర్వాహక సభ్యుడుగాఆదినారాయణ ఉన్నారు.

## యామిని కృష్ణమూర్తికి రంగస్థలి నివాళి

తిరుపతిటౌన్,ఆగస్ట్ 4ప్రభాతవార్త:



భరతనాట్యం,కూచిపూడి,ఒడిస్సీ నృత్యాలలో నిష్ణాతురాలైన యామిని కృష్ణమూర్తి అకాలమరణం కళా రంగానికి తీరని లోటని రాయలసీమ రంగస్థలి కలాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలోని రాయలసీమ కళాసంస్థ ఆదివారం ఉదయంయామినికృష్ణమూర్తిచిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో 1940 డిసెంబర్ 20న జన్మించారని తెలిపారు. ఆమె కూచిపూడి నృత్యానికి దేశవిదేశాలలో పేరు తెచ్చిపెట్టారని కొనియాడారు.కళాకారులు కెఎన్ రాజ, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పణిభూషణ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శాంభోలు హరినాథ్, బంకుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ లోకనాథం

తిరుపతి విద్య, ఆగస్టు 4, ప్రభాతవార్త



డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా తిరుపతి వాసి ప్రొఫెసర్ లోకనాథంను రాష్ట్ర ప్రభుత్వం, ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జేఏసి చైర్మన్ గండికోట నాగవెంకటేష్, చైనా దేశం శాస్త్రవేత్త డాక్టర్ కొరివి మల్లికార్జున్ తిరుపతిలోని ఆయన నివాసం వద్ద అభినందించారు. గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతూ ప్రొఫెసర్ లోకనాథం అమెరికా దేశం నందు శాస్త్రవేత్తగాను పనిచేశారు. తిరిగి మరల ద్రవిడ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫసర్‌గా రాయలసీమ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా డిన్ సిడిసి, హెడ్, బిఓఎస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ లోకనాథంను ఉర్దూ యూనివర్శిటీ రిజిస్ట్రర్‌గా నియమించడం హర్షణీయం.

## యువతరం సేవా సమితి 10వ వార్షికోత్సవం

శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని యువతరం సేవా సమితి పదవ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. సేవా సమితి ఏర్పాటు చేసి పది సంవత్సరాలు దాటింది. ఈ సేవా సమితి పేరుకు తగ్గట్లు కరోనా కాలంలోనూ, బాధితులను ఆదుకోవటంలో తమదైన శైలిలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సత్కారం కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.యువతరం ఎసేవా సమితి అధ్యక్షుడు వినోద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, ఎన్‌హెచ్ఏ 1 ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ తాను ఇక్కడ ఒరెండవ సారి పని చేస్తున్నానని అప్పన్నులకు ఆదుకొనుటలో యువతరం సేవా సమితి మేమున్నామని ముందుంటున్నారని వారి సేవా నిరతి ఎంత పొగిడినా తక్కువే అన్నారు. సంస్థ చైర్మెన్ యువ కిషోర్ సంస్థ పదేళ్ళలో అందించిన సేవాలను సాధించిన మానసిక ప్రశాంతతను వివరించారు. తమ సేవలకు ఎందరో సహకరించారన్నారు. ఈ సందర్భంగా అతిధులు సంస్థ అధ్యక్షులు వినోద్‌రెడ్డిని సత్కరించారు. ఈకార్యక్రమాల్లో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో స్విమ్స్ డైరెక్టర్

శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలో వెలసిన మహిమాన్విత పరశురామేశ్వరుని సేవలో ఆదివారం తిరుపతి స్విమ్స్ డైరెక్టర్ దంపతులు పాల్గొన్నారు.వారికి ఆలయ ఇఓ ఆదేశాలతో అర్చకుల సారథ్యంలో స్వాగతం పలికారు.పురావస్తు శాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ ఆలయంలో వెలసిన స్వామి మహిమాన్వితుడు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కుమార్ దంపతులు రాగా వారితో పాటు పిఆర్ఓ వి.రాజశేఖర్ ఉన్నారు. దర్శనానంతరం వారికి ఆలయ అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## జగనే ప్రచారం చేసి వున్నా గెలుపు మాత్రం తనదే

### – పెద్దిరెడ్డి ఎన్ని కుట్రలు చేసిన జనం తిప్పి కొట్టారు

నారాయణవనం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే తన ఓటమికి ప్రచారం చేసి వున్నా ప్రజలు మాత్రం తన వైపే వుండి గెలిపించి వుంటారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. తనను ఓడించడానికి మాజీ ముఖ్యమంత్రి, పుంగనూరు వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల సమయంలో ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేశారో అందరి తెలుసని, నేడు ఆయన పరిస్థితిని గమనించాలన్నారు. మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ 1,2 వార్డులోని కోటవీధిలో మాజీ ఎంపిపి, కైలాసకోన మాజీ ఛైర్మన్ ఎపి భక్తవత్సలం ఆధ్వర్యంలో టిడిపి విజయోత్సవ సంబరాల సభ జరిగింది. ముందుగా కీళగరం ఆటో స్టాండ్ సమీపంలోని ఎల్లమ్మ అమ్మవారికి జరిగిన అమావాస్య పూజలో పాల్గొన్నారు. అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి ఆటోస్టాండ్‌లో టిడిపి జెండా ఎగుర వేసి విజయోత్సవ సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తాను 40 ఏళ్ల క్రితమే ఉద్యమం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, తాను సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగానన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాటలను నమ్మి తన వద్ద అన్ని రకాల లబ్ధిపొందిన వారే ఈ ఎన్నికల్లో తాను ఓడిపోవాలని కంకణం కట్టుకొని ప్రచారాలు చేశారన్నారు. అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోను వదిలి పెట్టే పరిస్థితి లేదన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఎన్ భాస్కరన్, మాజీ నెడ్‌క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, కెఎస్‌రవి, నాయకులు దానా పరశురామయ్య. టి ఊరప్ప, అచ్చుకట్ల హరి, కందస్వామినాయుడు, సుధాబాబు, వేలురెడ్డి, టి సుబ్రమణ్యం, ఎపి మోహన్, ఎఎన్ రామలింగం, డిసి శేఖర్, మురుగన్, కన్నప్పన్, యువి కుమార్, చిన్నప్పస్వామి, ఎడి దేశప్ప, ఎంజిఆర్, హిమాచలం, లింగప్ప, సుబ్రమణ్యం, నేతాజీ, యువరాజు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఎరికంబట్టులో సప్రవాహనంపై ఊరేగిన ధర్మరాజులస్వామి

నారాయణవనం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం సాయంత్రం సప్రవాహనంపై వెంటకృష్ణపాలెం, ఎరికంబట్టు గ్రామాల్లో ఘనంగా ఊరేగారు. అంతకు ముందు ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, తోరణాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని హారతులు పట్టారు. మధ్యాహ్నం తిరుపతికి చెందిన హరికథ గాణ ప్రవీణ భాగవతారిణి యం.పూర్ణ ఆధ్వర్యంలో మహాభారతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆషాడం ఆడినెల అమావాస్య పూజలు

నారాయణవనం, ఆగస్టు 4 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఆదివారం ఆషాడం(ఆడి)నెల అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసొరకాయులస్వామి ఆలయంలోను ఆడినెల అమావాస్య పూజలను ఘనంగా జరిపారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి - ధనంజయ యాదవ్

విజయపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



2014 నుంచి 19 వరకు జరిగిన ఉపాధిహామీ, నీరు చెట్టు, ఎస్‌డీఎఫ్ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్ కోరారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి 2014–19 వరకు ఉపాధి హామీ, నీరు చెట్టు, ఎస్‌డీఎఫ్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అందుకు ఆయన స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పంచాయతీ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వై.వినోద్‌రాజు, గోగినేని వసుధ, అనంతపూర్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంగమ నాయుడు,విశాఖజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి ఆలయంలో అన్నదానం

పుత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. మధ్యాహ్నం భాగవతారని పి.స్వర్ణలత హరికథ గానం చేశారు. మండల ప్రజల్లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో భక్తులు హరికథ గానంకు హాజరయ్యారు. అమ్మవారికి భక్తులు మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## జిల్లా వర్కింగ్ అధ్యక్షునిగా మురళి ఏకగ్రీవ ఎన్నిక

రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ అధ్యక్షులుగా జిల్లా టీకాల అధికారి కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న రేణిగుంటకు చెందిన మురళిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా సమన్వయ కమిటీ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఏపీ తెలుగు నాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భానుమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి సమక్షంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో జిల్లా నుంచి సుమారు 150 మంది డిపార్ట్‌మెంట్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సభ్యులు మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాధ్యతాయుతమైన పదవి తనకు కట్టబెట్టినందుకు తోటి ఉద్యోగులకు, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉద్యోగులు ఆయనకు ఘన సన్మానం చేశారు.

## సత్యవేడు తహసిల్దార్‌గా టివి సుబ్రమణ్యం

సత్యవేడు, ఆగస్టు 4 ప్రభాతవార్త:



సత్యవేడు తహసిల్దార్‌గా టివి సుబ్రమణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత వైసిపి ప్రభుత్వంలో ఇక్కడ పనిచేసి బదిలీ అయిన ఆయన తిరిగి సత్యవేడుకు రావడం వెనుక ఆంతర్యమేమిటన్నది చర్చకు తెరతీసింది. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నేతలతో సన్నిహితంగా ఉన్న ఈ తహసిల్దార్ సక్రమంగా విధులు నిర్వహిస్తారా లేదా అనే అయోమయంలో తెదేపా శ్రేణులు అసంతృప్తివ్యక్తం చేస్తున్నాయి.

## చంద్రగిరి తహశీల్దార్‌గా శివరామ సుబ్బయ్య

చంద్రగిరి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



చంద్రగిరి తహశీల్దార్‌గా శివరామ సుబయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన తహశీల్దార్ మారుతి అనంతపురం జిల్లాకు బదిలీ కాగా డిప్యూటీ తహశీల్దార్ అమృతకు బాధ్యతలు అప్పగించి వెళ్ళారు. ఈ నేపథ్యంలో తొట్టంబేడు నుండి చంద్రగిరికి బదిలీ అయిన తహశీల్దార్ శివరామ సుబ్బయ్య ఇక్కడికి చేరుకుని అమృత నుండి బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి సమస్యలపై వచ్చే వారికి సకాలంలో సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలుకుతూ పుష్పగుచ్ఛం అందజేశారు.

**ప్రకటన**

పంచాంగం అరుణ్‌కుమార్ రెడ్డి S/o. పంచాంగం గోపాల్‌రెడ్డి అను నేను నాయొక్క పాస్‌పోర్ట్ పోయినది. ఇండియన్ పాస్‌పోర్ట్ J2831141 నెంబరు గల బ్లూ కార్డు ఎవరికైన దొరికిన యెడల దయచేసి క్రింది అడ్రస్‌కు తెలియజేయ వలసినదిగా కోరడం అయినది.

పంచాంగం అరుణ్‌కుమార్ రెడ్డి
S/o. పంచాంగం గోపాల్ రెడ్డి
గంగవరం గ్రామం & మండలం,
చిత్తూరు జిల్లా - 517 408
ఫోన్ : 9866116731, 8074300366

# రూ.12 కోట్లతో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు

## - మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



సూళ్లూరుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సిమెంటు రోడ్లు, డ్రైన్లు నిర్మించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.12 కోట్లు మంజూరు చేశారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ క్యాంప్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఆరు మండలాలకు సంబంధించి ఒక్కో మండలానికి రూ.2 కోట్లు చొప్పున అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో 2014 నుంచి 2019 వరకు సీఎంగా పనిచేసిన చంద్రబాబు 9వేల కోట్లు వ్యయం చేసి 24 వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. చంద్రబాబుతోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనడానికి చక్కటి ఉదాహరణ అని ఆయన చెప్పారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఒక కిలోమీటరు దూరం కూడా సిమెంటు రోడ్లు వేసిన పాపాన పోలేదన్నారు. అధికారం చేపట్టిన 50 రోజుల్లోనే అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరు చేయడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. అలాగే తీరప్రాంత మత్స్యకారులకు జీవనాధారమైన పులికాట్ సరస్సులో పూడిక తీసేందుకు రూ.179 కోట్లు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా మంజూరు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించడం హర్షణీయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరు సహకరిస్తే రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రం కాస్త ముందుకు వెళ్లేందుకు వీలవుతుందని నెలవల తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని ప్రతిపక్ష వైసీపీ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం రెండునెలలు కాకముందు ఇటువంటి చౌకబారు విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని గగ్గోలుపెట్టడం కూడా వారికే తగిందని నెలవల చెప్పారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో మరింతగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్, ఇవి సురేష్, సుధాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రివర్యా ఆర్టీసీ బస్టాండ్ వైపు చూడరా...!



నిరుపయోగంగా వున్న ఆర్టీసీ బస్టాండ్

చౌడేపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త

మంత్రివర్యా చౌడేపల్లి ఆర్టీసీ బస్టాండ్ వైపు చూడరా...అంటూ స్థానికులు ప్రయాణీకులు కోరుతున్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం చౌడేపల్లికి రానున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని పలమనేరు మార్గంలో గల నిరుపయోగంగా వున్న ఆర్టీసీ బస్టాండును వాడుకలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండును 2002సెప్టెంబర్ 30న అప్పటి తేదేపా ప్రభుత్వ హయాంలో 4గురు మంత్రులు బొజ్జా గోపాలకృష్ణారెడ్డి, కడియం శ్రీహరి, కోడెల శివప్రసాదరావు, దామచర్ల ఆంజనేయులు, అప్పటి చిత్తూరు ఎంపి నూతనకాల్వ రామకృష్ణారెడ్డి వంటి ఉద్దండులు ప్రారంభించారు. గత 22యేళ్ళుగా ఆర్టీసీ బస్టాండు ఎలాంటి ఆలనా, పాలనకు నోచుకోలేదని స్థానికులంటున్నారు. కేవలం పలమనేరు మార్గంలోని ఎర్రబస్సులే ఇక్కడ నిలుపుతున్నారు. బస్టాండులో బోరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలున్నా వాడుకలో లేక పోవడంతో ప్రయాణీకులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్దులు మరుగు కోసం చెట్లు, పుట్టల వైపు వెళ్ళాల్సి వస్తోంది. మంత్రి మండిపల్లి అయినా స్పందించి ఆర్టీసీ బస్టాండుకు మోక్షం కల్పించాలని ప్రయాణీకులు, స్థానికులు కోరుతున్నారు.

### సమాజంపట్ల బాధ్యత కలిగిన

# మిత్రులుండటం సంతోషం

## 1983-84 పూర్వవిద్యార్థులతో స్నేహితుల దినోత్సవం



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 4, ప్రభాతవార్త

ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరు...చదువుకున్న పాఠశాల, విద్యచెప్పిన గురువుల పట్ల ప్రేమానురాగాలు కలిగిఉండటం , సమాజం పట్ల బాధ్యతగా ఉన్న మిత్రులు కలిగి ఉండటం తమకు ఎంతో సంతోషమని 1983-84 సంవత్సరం పూర్వవిద్యార్థులు తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం తిరుపతిలోనిపండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నతపాఠశాల పూర్వవిద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ విద్యపూర్తిచేసుకున్న 40 సంవత్సరాల తరువాత కలుసుకున్న వీళ్ళంతా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఎక్కడెక్కడ నుండో వచ్చిన పాతమిత్రులు స్నేహితుల దినోత్సవం జయప్రదం ఓ హోటల్‌లో కోలాహలంగా జరిగింది. 1983-84 పూర్వవిద్యార్థులు కందారపు మురళి, ప్రధాన కార్యదర్శి కెవెల్ వర్మ, పగడాల అర్జున్, ట్రెక్కింగ్ బాలు, ఆర్ఆర్ శ్రీనివాస్, శ్రీనివాసులు, కె.సురేంద్ర, ముని, డాక్టర్ రామ్‌కుమార్, డాక్టర్ కిశోర్, డాక్టర్ శ్రీనివాసులు, ఆచార్య రమేశ్, సుబ్రమణ్యం, మన్నేపల్లి బాలకృష్ణ, కందారపు సురేంద్ర, మాజీ సర్పంచ్ ఆదం సుధాకర్‌రెడ్డి, విజేవి సురేష్, బివిరాయ్, కెజి శ్రీనివాస్ తదితరులు కలిశారు. ప్రతి ఏడాది పాత విద్యార్థులు కలుసుకోవడమేగాక తాము చదువుకున్న పాఠశాలకు, దాని అభివృద్ధికి దోహద పడుతున్నామన్నారు. మిత్రుల కుటుంబసభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. తమకు చేతనైన పరిష్కారాలు అందించడంకోసం ప్రయత్నంచేస్తున్నామన్నారు. దేశంలోఉన్నా,విదేశాల్లో ఉన్న మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఏడాదికోమారు తప్పనిసరిగా కలుసుకుని పాఠశాలకు కొంత మంచి చేస్తున్నామన్నారు. 1983-84బ్యాచ్‌లో పలువురు ఉన్నతాధికారులు. రాజకీయనాయకులు, వైద్యులు, ఇంజనీర్లు, వ్యాపారులు, సామాజికకార్యకర్తలు ఉన్నారన్నారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

# మధుర స్మృతులను పంచేదే స్నేహ బంధం

## -కలిసిన చెర్లోపల్లి హై స్కూల్ 1985-86 టెన్త్ బ్యాచ్



తిరుపతిరూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:

ధునియాలో స్నేహానికి మించిన బంధం మరోకటి లేదని....స్నేహ మేర జీవితం...స్నేహ మేర శాశ్వతం ఓ కవి స్నేహాన్ని గురించి గొప్పగా వివరించారు. అదే తరహాలో 39 సంవత్సరాల తర్వాత చెర్లోపల్లి హై స్కూల్లో 10వ తరగతిన చదివిన పూర్వ విద్యార్థులు ఒక వేదికపై కలిసి యోగ క్షేమాలు పంచుకున్నారు. చిన్ననాటి స్నేహ బంధాన్ని నెమరు వేసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పైడిపల్లి వద్ద ఓ మామిడితోపు కలిసి ఆనందంగా గడిపారు. అప్పుడప్పుడే నూ నూగు మీసాల వయస్సులో కలిసి మెలసిన తిరిగిన ఆ విద్యార్థులు 39 సంవత్సరాల తర్వాత మీసాలు వెరసే వయస్సులో కలిసి ఉత్సాహంగా గడిపారు. అలనాడు చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలు గుర్తు చేసుకోవడమే కాకుండా ప్రస్తుతం ఎవర్వేరు ఎలా ఉన్నారు...ఏ ఏ రంగాలలో స్థిరపడ్డారు...ఎవరి పిల్లలు ఏమి చదువుతున్నారు, అనే విషయాలను ఒకరి నోకరు అడిగి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులలో ఎవరైన ఇబ్బందుల్లో ఉంటే తగిన సహాయ, సహకారాలు అందించాటనికి నిర్ణయించారు. అలాగే పూర్వ విద్యార్థులు సమాజ సేవ చేయటానికి సిద్దమని తెలిపారు. పూర్వ విద్యార్థులలో మరణించినవారికి మౌనం వహిస్తూ నివాళ్ళు అర్పించారు. ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవం తర్వాత మొదటి ఆదివారం కలుస్తామని స్నేహితులు తెలిపారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగష్టు మొదటి ఆదివారం జరుపుకోవడం అనవాయితీ. చెర్లోపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఓ కుటుంబంలా కలిసిమెలసి ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఒకరినోకరు యోగక్షేమాలు తెలుసుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం మధ్యాహ్నం సామూహికంగా భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి హై స్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు గుత్తా కోటేశ్వరనాయుడు, జానకిరామిరెడ్డి, సురేంద్రనాయుడు, ఉమామహేశ్వరరెడ్డి, మునికృష్ణారెడ్డి, మునీశ్వరరెడ్డి, జ్యోతి, క్రిష్ణవేణి, శ్రీదేవి, హేమలత, గీత తదితర మిత్ర బృందం పాల్గొన్నారు.

# వరసిద్ధుని సేవలో పలువురు ప్రముఖులు



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు, మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న సూపరిండెంట్ వాసు

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:

సత్య ప్రమానాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులుదర్శించుకున్నారు. ఈమేరకు చిత్తూరు,పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్, మాజీ మంత్రి టీజీ వెంకటేష్ తదితరులు వేర్వేరుగా కాణిప్కాం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ వెంకటేశు, సూపరెండెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపుర ం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా వారు పూజలు నిర్వహించారు.

# ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు కంకణాల విరాళం



తిరుపతిటౌన్,ఆగస్ట్ 4ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాలను అభివృద్ధిచేయడంలో, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి మీరు చేస్తున్న కృషికి, శ్రమకు మా వంతు సహకారం అందిస్తామని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజినీకాంత్‌నాయుడు తెలిపారు. మిమ్మల్ని కలిసేందుకు వచ్చే పార్టీ నేతలు, కార్యకర్తలు శాలువలు,బొకేలతో గాకుండా రాష్ట్ర రాజధానిగా ప్రతిష్టాత్మకంగా అమరావతి నిర్మాణానికి, పేదప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు, అన్నా క్యాంటీన్లకు సహకారం అందించేలా పార్టీ కేడర్‌కు సూచించాలని అభిప్రాయం తెలియజేశారు. 22 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకోసం పదవులు ఆశించకుండా పనిచేశానని, శ్రమించానని తన శ్రమను గుర్తించి సముచిత ప్రాధాన్యతనిచ్చి రాష్ట్రంలో నామినేటెడ్ పదవికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కష్టించే వారికి, గత ఎన్నికల్లో పూర్తిగా పనిచేసిన వారికి తెలుగుదేశంపార్టీలో సముచిత స్థానం ఎప్పుడూ ఉంటుందని చంద్రబాబు తెలియజేశారని కంకణాల తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వంగా సిఎం చంద్రబాబును కలసి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌కు 5వేల రూపాయలు విరాళాల చెక్కును రజినీకాంత్‌నాయుడు అందజేశారు.

# టీచర్లను ఆదాయపన్ను నుండి మినహాయించండి

## కేంద్రమంత్రి వర్మకు ఆపస్ వినతి



తిరుపతి విద్య, ఆగస్టు 4, ప్రభాతవార్త

సేవా రంగం, దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే టీచర్లను ఆదాయపన్ను నుండి మినహాయించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చే యుటకు, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డిఎస్సి టీచర్లకు, పాత పెన్షన్ అమలు చేయుటకు కృషి చేయాలని, ప్రాథమిక విద్య మాతృభాషలోని ఉండే విధంగా చూడాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు పై ఇచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించి అన్ని కేడర్ల ప్రమోషన్లకు మార్గం సుగమం చేయాలని, టీచర్లకు బోధనేతర పనుల నుండి విముక్తి కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ జిడిపిలో 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వ జీడీపీలో 30 శాతం విద్యపై ఖర్చు చేయాలని, విద్యా రంగాన్ని వ్యాపారీకరణ నుండి కాపాడాలని తదితర సమస్యలను కేంద్ర భారీ పరిశ్ర మల, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంభిరెడ్డి, జిల్లా సహా అధ్యక్షులు డా. దేవరాజులు, జిల్లా నాయకులు ఐ. దాము, రాఘవ తదితరులు వినతిపత్రం ఇచ్చి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# చల్లా బాబును కలిసిన రాయల్ బాబు



రొంపిచర్ల, ఆగస్టు 4, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాయలబాబు రాజేంద్రప్రసాద్ పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లాబాబును ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా చల్లా బాబు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తాను తీసుకెళ్లానని అన్నారు. రాయల్ బాబుతో పాటు చల్లా బాబులు కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సెక్రటరీ మధుబాల, కోశాధికారి అమర్నాథ్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగే నాయక్, వైస్ ప్రెసిడెంట్లు డాక్టర్ మనోహర్, పాండురంగయ్య ఉదయ్ భాస్కర్, జాయింట్ సెక్రెటరీ మంజుల, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధారాణి, గ్లోరీ సుధ రాణిలు వున్నారు.

# సమ్మిట్ ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే అవకాశం

## వైస్ చాన్సలర్ అప్పారావు



తిరుపతి విద్య, ఆగస్టు 4, ప్రభాతవార్త

భారతదేశంలోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న ఇంటర్నేషనల్ క్యాంపస్ కనెక్ట్ సంస్థ తిరుపతిలో మొట్టమొదటిసారిగా గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫైర్ 2024 సమ్మిట్ ఏర్పాటు చేసింది. ఈ సంస్థ డైరెక్టర్ నరసింహ ఆధ్వర్యంలో ప్రపంచంలోని 100 కంపెనీలకు చెందిన ప్రతినిధులు బృందం పలువురు హాజరయ్యారు. స్థానిక ఓ ప్రయివేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2024 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ అప్పారావు, శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ రిజిస్ట్రర్ రజిని, సినీ పరిశ్రమ ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఐటీ కంపెనీ సిఈఓ వంశీ రాయల, అమెరికా తెలుగు అసోసియషన్ (ఆటా) ఇండియా కోఆర్డినేటర్ సూర్య చంద్రారెడ్డి పలువురు ప్రముఖులు వివిధ దేశాలు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమ్మిట్‌ను ఉద్దేశించి శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అప్పారావు మాట్లాడుతూ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫైర్ 2024 సమావేశాన్ని తిరుపతిలో నిర్వహించడం ద్వారా ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే అవకాశం కలుగుతుందన్నారు. మొదటిగా వారి తల్లిదండ్రులకు ఉన్నత చదువుపై అవగాహన కల్పించడం ద్వారా వారి పిల్లలను మంచి ఉన్నత చదువులతో పాటు మంచి ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ముఖ్య కారకులు అవుతారని తెలిపారు. గతంలో అయితే విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువుకొని దిక్కుతోచని స్థితిలో విదేశాలకు వెళ్లి పెట్రోల్ బంకులు హోటల్‌లో పనిచేసే దుస్థితి ఏర్పడుతున్న నేపథ్యంలో ఐసీసీ డైరెక్టర్ నరసింహ ఆధ్వర్యంలో ఇలాంటి సమావేశాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తరువాత శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీ రిజిస్ట్రర్ రజిని మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. తప్ప ఆ చదువుకు తగిన ఫలితాలని సాధించలేక పోతున్నారని బాధపడ్డారు. ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థిని విద్యార్థులు మంచి నైపుణ్యత సంపాదించుకొని విదేశాల్లో వారి ఉద్యోగాల్లో నైపుణ్యత సంపాదించి అందరికీ ఆదర్శమవుతారని తెలిపారు. ఐసీసీ డైరెక్టర్ నరసింహ మాట్లాడుతూ ఇప్పటికే ఐసీసీ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫైర్ పేరుతో ప్రధాన నగరాల్లో విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారిని మంచి ఉద్యోగాల్లో స్థిరపడే విధంగా సమస్త నరపోత్సహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటి వరకు వందల సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి వారిని ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తు కోసం సమస్త సైనికులను పనిచేస్తుందని తెలియజేశారు. అనంతరం సిసి మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ తిరుపతిలో ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉందన్నారు. దేశంలోని ప్రతి విద్యార్థిని విద్యార్థి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిసి ప్రతినిధులు, వివిధ యూనివర్శిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్యాకల్టీలు ప్రతినిధులు బృందం విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద

### సమస్యల పరిష్కార దిశగా

# అధికారులు అడుగులు వేయాలి

## సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని



యర్రావారిపాలెం, ఆగస్టు 4, ప్రభాతవార్త

మండలంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికై మండలంలోని అధికారులతో, పార్టీ కార్యకర్తలతో కలిసి వెలుగు కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారమే అజెండాగా సాగిన మండల సర్వసభ్య సమావేశంకు ముఖ్య అతిధిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు పార్టీలకు అతీతంగా ఎంఎల్ఎకి దీర్ఘకాలిక సమస్యలను తెలియపరచేందుకు భారీగా తరలివచ్చారు. అధికారులు గత ప్రభుత్వంలో మొదలు పెట్టి పూర్తి గాని పనుల గురించి ప్రస్తావించారు. వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని మండలంలోని సమస్యలను, పెండింగులో ఉన్న పనులను, జరుగవల్సిన అభివృద్ధి గురించి వివరించారు. అంతేకాకుండా మండలంలోని సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన పలు వాగ్దానాలు వాటి పరిష్కార దిశగా అధికారులు అడుగులు వేయాలని అంతేకాకుండా ఎన్నికలకు ముందు మాత్రమే రాజకీయం, ఆ తరువాత నియోజకవర్గ అభివృద్ధి నాకు ముఖ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులు, నాయకులు తెలిపిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వాటి నిధుల సేకరణ కొరకై ఇప్పటికే ప్రతిపాదనలు పూర్తి చేసినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ఎంత వ్యయం అవసరమో అంచనా వేయాలని అధికారులను కోరారు. అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, కనీస మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని దిశానిర్దేశం చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

# శ్రీకాళహస్వీరాలయంలో రికార్డు స్థాయిలో పూజలు: ఆదాయం



శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయంలో సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. రాజకీయ వత్తిడి లేకపోవటంతో దళారుల బాధ తప్పింది. ఇక ఆలయాధికారులు జవాబుదారితనంతో పని చేసారు. వచ్చిన ప్రతి భక్తుడు క్యూలైన్లలో సాఫీగా సాగారు. సుదర్శనంతో పాటు సత్వర దర్శనం చేసుకున్నారు. అధికారులు అందించిన సమాచారం మేరకు రాహుకేతుదోష నివారణ పూజలు9168 జరిగి ఆలయానికి రూ.1కోటి 95వేల 356లు వచ్చింది. రెండు నెలల క్రితం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పలు సంస్కరణలు అమలుకు అధికారులను ఆదేశించారు. ఆలయ ఇఓ ఎన్‌వియస్ఎన్ మూర్తి అధికారులు, సిబ్బంది చొరవ చూపారు.వచ్చిన ప్రతి భక్తుడు సుదర్శనం చేసుకునేటట్లు ప్రణా ళికలను అమలు చేయటంలో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఎఇఓ లోకేష్‌బాబు, సూపరింటెండెంట్ నాగభూషణం, సిస్టమ్స్ అడ్మిన్ నాగయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుదర్శనం నాయుడు, హరియాదవ్,ఎస్‌పిఎఫ్,హోంగార్డుల చొరవ తో విజయం సాధించారు.

# గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ, అమర ఆస్పత్రి కీలక ఒప్పందం



అమర ఆస్పత్రిలో ఒప్పందం దృశ్యం

రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆస్పత్రి, బేలారస్ గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీ మధ్య ఆదివారం సమన్వయంతో కూడిన అధికార ఒప్పందం జరిగింది. వైద్య, విద్యా, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడానికి అమర ఆస్పత్రిలో ఇరుసంస్థల అధినేతలు ఒప్పంద పత్రాలను పై సంతకాలు చేశారు. ఒప్పందం వల్ల రెండు సంస్థల మధ్య క్లినికల్ అబ్జర్వర్షిప్, శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన సహకారాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తాయి. జీఎస్ఎంయూ విద్యార్థులు అమర ఆస్పత్రిలో క్లినికల్ శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా ఫ్యాకల్టీ సభ్యులు ప్రొఫెషనల్ ఎక్స్‌ఛేంజీలు, సహకార పరిశోధన ప్రాజెక్టుల్లో పాల్గొంటారు. ఈ భాగస్వామ్యం ఉమ్మడి పరిశోధన వర్క్‌షాప్పు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా సులభతరం చేయడానికి దోహదం చేస్తాయి. సమావేశంలో విదేశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర ఆస్పత్రి చైర్మన్ డా. ప్రసాద్‌గౌరినేని మాట్లాడుతూ ఐదేళ్ళ ఒప్పందంలో వైద్య, విద్య, పరిశోధనల అంతర్జాతీయ కరణలో అభివృద్ధి వైపు దూసుకుపోయే సువర్ణ అవకాశం లభించిందన్నారు. ఇరు సంస్థలు ఉమ్మడి కార్యక్రమాల ద్వారా వైద్య శాస్త్రం, అభ్యాసాన్ని అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉంటాయన్నారు. డా. కరామి ఆంద్రీ(డీన్) మాట్లాడుతూ భారతదేశంలోని ప్రఖ్యాత వైద్య సంస్థగా పేరు తెచ్చుకున్న అమర ఆస్పత్రితో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ఒప్పందం మా విద్యార్థులకు విలువైన క్లినికల్ ఎక్స్‌పోజర్ను అందిస్తుందని, తమ ఫ్యాకల్టీ సభ్యుల మధ్య అర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో చివరిగా విదేశాల నుంచి వచ్చిన అతిథులను అమర ఆస్పత్రి తరఫున మెమెంటోలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి, అమర ఆస్పత్రి సీఏవో వేణుగోపాల్‌నాయుడు, మెడికో అబ్రాడ్ చైర్మన్ రాజారామ్, పేరెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరకిరణ్, వైస్ ప్రెసిడెంట్ ప్రియవర్ధన బాబు, ట్రెజరర్ హేమాద్రి, రాధ తదితరులు పాల్గొన్నారు.